https://teluguislam.net



# అధ్యాయం-4

## 110-127

## 4-నఫిల్ ఆరాధనలు పాటించువారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

- అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే అదనపు ఆరాధనలు.
- అల్లాహ్ తన దాసుల పుణ్యాలను రెట్టింపు చేస్తాడు.
- సున్నత్ మరియు నఫిల్ నమాజులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- క్రమం తప్పకుండా చేసే పుణ్యాలు అల్లాహ్‌కు ప్రీతికరమైనవి.
- తహజ్జుద్ నమాజ్.
- విత్ర్ నమాజు.
- చాష్త్ నమాజు (జుహా లేక అవ్వాబీన్ల నమాజు).
- తస్‌బీహ్ నమాజు.
- పశ్చాత్తాపం నమాజు.
- వుజూ చేసిన తరువాత రెండు రకాతుల నమాజు.
- నఫిల్ ఉపవాసాలు.

https://teluguislam.net



# 4–నఫిల్ ఆరాధనలు పాటించువారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

**అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే అదనపు ఆరాధనలు:**

విశ్వాసి అల్లాహ్ విధుల్ని (ఫర్జ్ ఆరాధనలు) పాటిస్తూ, స్వయంగా తన తరఫు నుండి కూడా సున్నత్ మరియు నఫిల్ ఆరాధనలు చేస్తూ అల్లాహ్ సామీప్యాన్ని పొందటానికి కృషి చేస్తూ ఉంటాడు.అయితే స్వచ్ఛందంగా చేసే ఆరాధనలు పాటించకపోతే పాపం లేదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మరెవరయితే సత్కార్యాలు చేస్తూ ఉంటాడో అతను విశ్వాసి(కూడా) అయివుంటే అతని కృషికి గుర్తింపు లభించకపోవటం అంటూ జరగదు. మేము దాన్ని వ్రాసి ఉంచాము.’’[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘స్వచ్ఛందంగా ఎవరైనా ఏదైనా సత్కార్యం చేస్తే అల్లాహ్ ఆదరించేవాడు, తెలుసుకునేవాడు.’’ [2]

మరొకచోట ఇలా తెలియజేశాడు: ‘‘కాని ఎవరైనా స్వచ్ఛందంగా ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు.’’ [3]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు.’’ [4]

---

[1] (సూరతుల్ అంబియా:94).

[2] (సూరతుల్ బఖరా: 158).

[3] (సూరతుల్ బఖరా: 184).

[4] (సూరతుల్ బఖరా: 215).

https://teluguislam.net



మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఎవరు అణుమాత్రం సత్కార్యం చేసిన దాన్ని అతను చూసుకుంటాడు.’’ [1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ఇలా అంటున్నాడని తెలియజేశారు: ‘‘ఎవరైనా నా మిత్రుణ్ణి ద్వేషిస్తే నేనతనిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నాను. నా దాసుడు నేను విధించిన ఫర్జ్‌ల(విధులను)ను నిర్వర్తించి నా సామీప్యం పొందాలనుకుంటే, దాన్ని నేను అన్నిటికన్నా ఎక్కువగా యిష్టపడతాను. నా దాసుడు స్వచ్ఛంద ఆరాధనల (నవాఫిల్) ద్వారా కూడా నా సామీప్యాన్ని పొందటానికి కృషి చేస్తూ ఉంటాడు. అది చూసి నేనతన్ని ప్రేమించటం మొదలుపెడతాను. నేను గనక అతన్ని ప్రేమించానంటే నేనతను వినే చెవినైపోతాను, అతను చూసే కన్ను నయిపోతాను, అతను పట్టుకునే చేయినై పోతాను, అతను నడిచే కాలునై పోతాను. అతను నన్నేదయినా అడిగితే తప్పకుండా ఇస్తాను. అతను శరణు కోరితే తప్పకుండా నేనతనికి శరణు ఇస్తాను.....’’ [2]

మనం సున్నత్ మరియు నఫిల్ (స్వచ్ఛందంగా) ఆరాధనలు పాటించి నందుకు అల్లాహ్ అనేక విధాలుగా అనుగ్రహిస్తాడు. మరియు ఆయన ప్రసన్నుడవుతాడు, తన ప్రియదాసులుగా చేసుకుంటాడు, కోరింది ప్రసాదిస్తాడు, మా మొరలను ఆలకిస్తాడు. మరియు ప్రతి బాధలోను, ప్రతి కష్టంలోను ఆదుకుంటాడు. చివరకు ప్రళయ దినాన మనం విధిగా పాటించవలసిన ఏవైన ఆరాధనలు కొరత ఉంటే, వాటిని మనం చేసిన

---

[1] (సూరతుల్ జిల్‌జాల్:7).

[2] (బుఖారీ:6021).

https://teluguislam.net



నఫిల్ ఆరాధనలను ఫర్జ్ ఆరాధనలుగా మార్చుకుంటాడు. మరియు క్షమిస్తాడు. కనుక ఒక హదీసులో ఇలా వుంది:

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ప్రళయ దినాన మనిషి అన్నిటికంటే ముందు ప్రశ్నించబడేది అతను విధిగా చేయవలసిన నమాజు గురించి. అతను నమాజు సవ్యంగా ఆచరించి ఉంటే, సాఫల్యాన్ని విజయాన్ని పొందుతాడు. ఒకవేళ నమాజు సవ్యంగా లేదంటే, అవమాన పాలవుతాడు, నష్టపోతాడు. కొందరు (సోమరితనంవల్ల) నమాజులను (చదవని కారణంగా) కొరత చేసిఉంటే, ప్రళయ దినాన అల్లాహ్ ఇలా అంటాడు: ''నా దాసుడు నఫిల్ (అదనపు) నమాజు ఏమైనా నెరవేర్చి ఉంటే వాటి ద్వారా విధి గావించబడిన నమాజుల కొరతను పూర్తి చేయండి'' అని ఆజ్ఞాపిస్తాడు. అలా (విశ్వాసులుగా ఉన్న) వారి (ఇతర) కర్మల పట్లా ఇదే విధంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది.''[1]

## అల్లాహ్ తన దాసుల పుణ్యాలను రెట్టింపు చేస్తాడు:

ఒక వ్యక్తి పాపాలు చేస్తే ఎంత పాపం చేస్తాడో అంతే దుష్ఫలితం పొందుతాడు. కాని ఆ పాపానికి బదులు ఎక్కువ దుష్ఫలితం పొందడు. అదే ఒక వ్యక్తి పుణ్యకార్యాన్ని చేస్తే దానికి ఎంత పుణ్యమో అంతే ప్రతిఫలం పొందుతాడు. అలాగే కొన్ని సార్లు ఒకే పుణ్యానికి బదులు దాని ప్రతిఫలం ఎన్నో రెట్లు పెంచి ఇవ్వడం జరుగును. అది అల్లాహ్ వైపునుండి ప్రత్యేకమైన సందర్భాలలో మరియు ప్రత్యేకమైన పుణ్యాలను బట్టి ప్రతిఫలం

[1] (సహీహ్ తిర్మిజీ:413, సహీహ్ నసాయి:465, సహీహ్ అబూదావూద్:864).

https://teluguislam.net



ప్రాప్తమవుతుంది. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘అల్లాహ్ వద్దకు సత్కార్యాన్ని తీసుకువచ్చే వాని కొరకు పది వంతులు ప్రతిఫలం ఉంది. దుష్కార్యాన్ని తీసుకువచ్చే వాని కొరకు అతడు ఎంత తప్పు చేశాడో అంతే ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.’’ [1]

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ‘‘మీరు గనక అల్లాహ్‌కు మంచి రుణాన్ని ఇస్తే, ఆయన మీకు దానిని ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. మీ పొరపాట్లను మన్నిస్తాడు.’’ [2]

హ‌జ్రత్ అబూ జ‌ర్రీన్ (రజియల్లాహు అన్హు) కథనం; అల్లాహ్ ప్రవచించాడనీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు:

‘‘ప్రతి పుణ్యం పది పుణ్యాల వంటిది లేక దానికంటే ఎక్కువ. మరియు పాపము ఒక పాపము వంటిది. లేక దానిని కూడా అల్లాహ్ క్షమించవచ్చు. నీవు అల్లాహ్‌కు సాటి కల్పించకుండా భూమినిండా పాపాలు చేసి కలిసినా, అల్లాహ్ కూడా నిన్ను భూమినిండ క్షమాపణలతో కలుస్తాడు.’’ [3]

‘‘తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసేవారి ఖర్చు ఉపమానం ఇలా ఉంటుంది. ఒక్క విత్తనాన్ని నాటితే అది మొలచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపజేస్తాడు. అల్లాహ్ అమితంగా ఇచ్చేవాడూ, అన్నీ తెలిసినవాడునూ.’’ [4]

---

1 (సూరతు అన్‌ఆమ్: 160).

2 (సూరతుత్ తగాబున్: 17).

3 (అహ్మద్:20398, అస్ సిల్‌సిలతుస్ సహీహ: 581).

4 (సూరతుల్ బఖరా: 261).

https://teluguislam.net



ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి అల్లాహ్ మార్గంలో ఒక ఒంటెను దానం చేశాడు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి ఇలా (శుభవార్తను) తెలిపారు: **''ప్రళయ దినాన దీనికి బదులు నీకు అల్లాహ్ ఏడువందల ఒంటెలను ప్రసాదిస్తాడు.''** [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం; అల్లాహ్ ప్రవచించాడనీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ పుణ్యాలను మరియు పాపాలను విధిరాతలో పొందుపరిచాడు. తరువాత వాటిని వేరువేరు చేశాడు.

ఎవరైనా మంచిని చేయాలని అనుకొని దానిని చేయలేక పోయినా అల్లాహ్ దాని పూర్తి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు.

ఒక వేళ అతను చేయాల నుకున్న పుణ్యకార్యాన్ని చేస్తే, అల్లాహ్ ఆ పుణ్యానికి ప్రతిఫలంగా పదిరెట్ల నుండి పెంచి ఏడువందల రెట్లు వరకూ పెంచుతాడు. (అల్లాహ్ అనుకుంటే)మరింత ఎక్కువగా కూడా పెంచుతాడు.

ఎవరైనా చెడుని గురించి ఆలోచించి దానిని చేయలేదు, అయినా దానికి బదులు ఒక పూర్తి పుణ్యాన్ని ప్రసాదిస్తాడు.

ఒక వేళ అతను అనుకున్న చెడు కార్యాన్ని చేస్తే, దానికి బదులు అతనికై ఒక పాపమే పొందుపరుస్తాడు.'' [2]

[1] (ముస్లిం:3508).

[2] (బుఖారీ:6010, ముస్లిం:187).

https://teluguislam.net



## సున్నత్ మరియు నఫిల్ నమాజులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ సామిప్యం మరియు ప్రీతి పొందుట కొరకు నమాజు అతి గొప్ప మార్గం. మరియు నఫిల్ నమాజులు అనగా ఫ్రర్జ్ నమాజులు తప్ప మనం చదివే ప్రతి నమాజును నఫిల్ గా భావించవచ్చు. అంటే: ప్రతి రోజు చేసే సున్నతులు,నఫిల్ నమాజులు మరియు తహజ్జుద్ నమాజ్, వితర్ నమాజ్, జుహా నమాజులు వంటివి.

హజ్రత్ మాదాన్ బిన్ అబీ తల్హా అల్ యామరియ్యు (రజియల్లాహు అన్హు) కథనం: నేను సౌబాన్ మౌలా (రజియల్లాహు అన్హు) గారితో కలిసి:
''నా కొరకు మీరు ఏదోఒక్క కార్యం గురించి తెలుపండి దాని ద్వారా నేను స్వర్గానికి చేరుకోవాలి. లేదా అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం గురించి తెలుపండి'' అని కోరాను.

దానికి ఆయన: సమాధానం ఇవ్వలేదు. మరలా నేను వారితో ప్రశ్నించాను. అయినా సమాధానం ఇవ్వలేదు. మూడవసారి నేను వారితో ప్రశ్నించాను. అప్పుడు ఆయన: ''నేను కూడా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో ఇలాగే ప్రశ్నించాను''

అప్పుడు ప్రవక్త (స): ఇలా తెలియజేశారు: సౌబాన్! ''నీవు ఎక్కువగా సజ్దాలు చేస్తూ ఉండూ. ఎందుకంటే? నీవు చేసే ప్రతి సజ్దాకు బదులుగా అల్లాహ్ నీ కొరకు ఒక అంతస్తు పెంచుతాడు. మరియు ఒక పాపాన్ని తుడిచివేస్తాడు.'' [1]

---

[1] (ముస్లిం:753).

https://teluguislam.net



ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సేవకులు మరియు సుఫ్ఫా విద్యార్థుల్లో ఒకరైన హజ్రత్ అబూ ఫిరాస్ రబీయా బిన్ కాబ్ అస్లమీ (రజియల్లాహు అన్హు) కథనం:

నేను రాత్రి పూట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంట ఉండేవాడిని. ఆ సమయంలో నేనాయనకు వుజూ చేసుకోవటానికి నీళ్ళు, ఇతర అవసరమైన వస్తువులు అందించేవాణ్ణి.

ఒక రోజు ఆయన: ‘‘నా నుండి నీకేం కావాలో కోరుకో’’ అని అన్నారు.

అందుకు నేను:‘‘స్వర్గంలో మీకు తోడుగా ఉండే భాగ్యాన్ని కోరుకుంటున్నాను’’ అని విన్నవించుకున్నాను.

తిరిగి ఆయన(స): ‘‘ఇంకా ఏమైనా కోరుకుంటున్నావా’’ అని అడిగారు.

దానికి నేను ‘‘అది చాలు’’ అని అన్నాను.

అప్పుడు ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) ‘‘మరయితే దానికోసం ఎక్కువగా సజ్దాలు చేస్తూ నాకు చేదోడుగా ఉండు’’ అని అన్నారు. [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేస్తుండగా మాతృమూర్తి హజ్రత్ ఉమ్మె హబీబా రమ్లా బిన్తె అబూ సుఫ్యాన్ (రజియల్లాహు అన్హా) తాను విన్నానని ఇలా తెలియజేశారు:

‘‘ఏ ముస్లిం దాసుడయినా అల్లాహ్ కోసం ప్రతి రోజూ ఫర్జ్ నమాజులు కాక (అదనంగా) పన్నెండు రకాతుల (సున్నత్) నమాజ్ చేస్తాడో, అల్లాహ్ అతని కోసం గృహాన్ని నిర్మిస్తాడు (లేక) అతని కోసం స్వర్గంలో ఒక గృహం నిర్మించబడుతుంది’’ అని అన్నారు. [2]

---

[1] (ముస్లిం:754).

[2] (ముస్లిం:1199).

https://teluguislam.net



జుహ్ర్ ఫర్జ్ నమాజ్‌కు ముందు నాలుగు రకాతులు, ఫర్జ్ తర్వాత రెండు రకాతులు, మగ్రిబ్ తర్వాత రెండు రకాతులు, ఇషా తర్వాత రెండు రకాతులు, ఫజ్ర్ (ఉదయం) ఫర్జ్‌కు ముందు రెండు రకాతులు.[1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రమం తప్పకుండా పాటించిన నమాజులు. వీటిని **'సుననే ముఅక్కదా'** అని అంటారు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''జుహ్ర్‌కు ముందు నాలుగు రకాతుల్ని దాని తర్వాత నాలుగు రకాతుల్ని క్రమం తప్పకుండా చేసేవారి కొరకు అల్లాహ్ నరకాగ్నిని నిషిద్ధం చేశాడు.''[2]

అస్ర్ సమయంలో ఫర్జ్ నమాజుకు ముందు 4 రకాతులు. మగ్‌రిబ్ సమయంలో ఫర్జ్ నమాజుకు ముందు 2 రకాతులు. మరియు ఇషా సమయంలో ఫర్జ్ నమాజుకు ముందు 4 రకాతులు. సున్నతే ముఅక్కదా పరిధిలోకి రావు. అయితే ఈ నమాజులను కూడా చదవడం ఎంతో అభిలషణీయం (ముస్తహబ్).

హజ్రత్ ఇబ్ను ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ''అస్ర్‌కు ముందు నాలుగు రకాతులు చేసేవారిని అల్లాహ్ కరుణించుగాక!'' అని దీవించారు.[3]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''జుహ్ర్‌కు ముందు నాలుగు రకాతులను ఉదయానికి (ఫజ్ర్‌కు) ముందు రెండు రకాతులను ఎన్నడూ వదలిపెట్టేవారు కాదు.''[4]

---

[1] (సహీహ్ తిర్మిజీ:415).
[2] (సహీహ్ అబూదావూద్:1269, సహీహ్ తిర్మిజీ:428).
[3] (అబూదావూద్:1271, తిర్మిజీ:430).
[4] (బుఖారీ:1110).

https://teluguislam.net



హ్రజత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

‘‘ఫజ్ర్ వేళ చేసే రెండు రాకాతుల (సున్నత్) నమాజు – ప్రపంచం అందులో ఉన్న వస్తువులన్నిటికంటే శ్రేష్ఠమైనది.’’ [1]

**మరొక ఉల్లేఖన ప్రకారం:** ‘‘ఆ రెండు రకాతుల నమాజు నాకు ప్రపంచమంతటి (ధన సామగ్రి) కన్నా ప్రియమైనవి.’’ [2]

## క్రమం తప్పకుండా చేసే పుణ్యాలు అల్లాహ్‌కు ప్రీతికరమైనవి:

ఎల్లపుడూ క్రమం తప్పకుండా మనిషి చేసే మంచి పనినే అల్లాహ్ ఎక్కువగా ఇష్టపడుతాడు. అది కొంచమైనను చాలు. మనం నఫిల్ నమాజులను ప్రారంభిస్తే వాటిని ప్రతి రోజు నెరవేర్చుటకు ప్రయత్నించాలి. అలాగే నమాజు విధుల్లో సుధీర్ఘమైన ఖియామ్‌తో కూడిన నమాజు అత్యంత శ్రేష్ఠమైనది. మరియు అల్లాహ్‌కు ప్రీతికరమైనది.

హ్రజత్ ఆయిషా(రజియల్లాహు అన్హ)ఉల్లేఖనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ‘‘షాబాన్ నెలకంటే ఎక్కువగా ఉపవాసాలు ఇతర నెలల్లో పాటించేవారు కాదు.

ఆయన షాబాన్ నెల మొత్తం ఉపవాసాలు పాటించి ఇలా అనేవారు: మీ శక్తిమేరకే పనులు చేయండి. అల్లాహ్ విసుగు చెందడు చివరికి మీరే విసుగెత్తి పోవచ్చు.

---

[1] (ముస్లిం:1193).
[2] (ముస్లిం:1194).

https://teluguislam.net



ప్రవక్త(స)కు అన్నిటికంటే అత్యంత ప్రియమైన నమాజు శాశ్వితంగా (ఎల్లప్పుడు) పాటించే నమాజు, అది స్వల్పమైన సరే. మరియు ఆయన నమాజును పాటిస్తే దాన్ని శాశ్వితంగా పాటించేవారు.''[1]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ఒక సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన దగ్గరకు వచ్చినప్పుడు ఆమె దగ్గర ఒక స్త్రీ కూర్చొని ఉంది.
ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు: ''ఎవరీమె?'' అని అడిగారు.
దానికి హజ్రత్ ఆయిషా (రజి): ''ఈమె ఫలాన స్త్రీ. ఎక్కువగా నమాజులు చేస్తుందంటూ (ఇతరులు) చెప్పుకుంటారు'' అని తెలిపారు.
అది విని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఇక ఆపు, మీ శక్తిమేరకే పనులు చేయండి. అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ విసుగు చెందడు చివరికి మీరే విసుగెత్తి పోవచ్చు.''[2]

శక్తికి మించిన ఆరాధన చేయడాన్ని ఈ హదీసులో వారించడం జరిగింది. ఎందుకంటే ఇలా చేయడం వల్ల మనిషి కొన్ని రోజుల తర్వాత దానిపై విసుగు చెంది, అసలు ఆరాధనే మానేసే ప్రమాదముంది.కనుక ఆరాధనలు వినయ విధేయతల్లో మధ్యేమార్గాన్ని అవలంభించడం అవసరం.

మరియు హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం: ''నమాజులన్నిటిలో అత్యంత శ్రేష్ఠమైన నమాజు ఏది?'' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అడగటం జరిగింది. అందుకాయన: **'సుదీర్ఘంగా నిలబడి చేసే నమాజు'** అని చెప్పారు. [3]

---

[1](బుఖారీ:1834).
[2] (బుఖారీ:1083).
[3] (ముస్లిం:1258).

https://teluguislam.net



నఫిల్ నమాజుల్లో ఎక్కువగా ఖుర్ఆన్ పారాయణం చేయటానికి వీలవుతుంది. మరియు చాలా సేపు ఖియామ్‌లో నిలబడి చేసే నమాజు అత్యంత శ్రేష్ఠమైనది అని పైన ఇవ్వబడిన హదీసు ద్వారా తెలుస్తున్నది.

## తహజ్జుద్ నమాజ్:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''రాత్రిపూట తహజ్జుద్ నమాజు చెయ్యి. ఇది నీకు అదనపు నమాజు. నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్ఠింప జేయటం జరుగుతుంది.'' [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: ''అల్లాహ్ వద్ద అత్యంత ప్రీతిపాత్రమైన నమాజు దావూద్ (అలైహిస్సలామ్) నమాజు. అత్యంత ప్రీతిపాత్రమైన ఉపవాసం దావూద్ (అలైహిస్సలామ్) ఉపవాసం.

ఆయన అర్థరాత్రి వరకు నిద్రపోయేవారు. తర్వాత మూడింటిట ఒక వంతు రాత్రి భాగంలో అల్లాహ్‌ను ఆరాధించేవారు.

ఆ తర్వాత ఆరోవంతు భాగంలో (మళ్ళీ) నిద్రపోయేవారు. ఒక రోజు ఉపవాసం ఉంటే మరోరోజు ఉపవాసం మానుకునేవారు.'' [2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విధి నమాజు తరువాత అన్నిటికంటే శ్రేష్ఠమైనది తహజ్జుద్ నమాజు...'' [3]

---

[1] (సూరతుల్ ఇస్రా: 79).

[2] (బుఖారీ:1063, ముస్లిం:1969).

[3] (ముస్లిం:1983).

https://teluguislam.net



హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

- ''ప్రజలారా! సలాంను వ్యాపింపజేయండి.
- అన్నం తినిపించండి.
- చుట్టరికాన్ని బల పర్చండి.
- ప్రజలు రాత్రి నిద్రలో ఉండే సమయంలో నమాజు చేయండి.

అలా చేస్తే మీరు ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశించగలరు.'' [1]

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఏ వ్యక్తి అయితే రాత్రి ఒక భాగాన్న (నిద్ర) మేలుకునీ నమాజు చేసి, అలాగే తన భార్యను కూడా నమాజు పాటించుటకై నిద్రనుండి మేలుకోల్పాడు. అయిన ఆమె మేలుకోవడానికి నిరాకరిస్తే, ఆమె ముఖంపై నీటి చుక్కలు చెల్లిన వ్యక్తికీ అల్లాహ్ కరుణించుగాక!.''

మరియు 'ఏ స్త్రీ అయితే రాత్రి ఒక భాగాన్నే (నిద్ర) మేలుకొనీ నమాజు చేసి, అలాగే తన భర్తను కూడా నమాజు పాటించుటకై నిద్రనుండి మేలుకోల్పింది. అయినా అతను మేలుకోవడానికి నిరాకరిస్తే, అతని ముఖంపై నీటి చుక్కలు చెల్లిన స్త్రీకీ అల్లాహ్ కరుణించుగాక!.' [2]

హ్రజత్ అబూ ఉమామా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''తహజ్జుద్ నమాజు తప్పక చేయండి, అది గతించిన పుణ్యాత్ముల ఆచారం, మరియు

---

[1] (సహీహ్ ఇబ్నుమాజా: 1334, సహీహ్ తిర్మిజీ: 2485,).

[2] (సహీహ్ అబూదావూద్:1308).

https://teluguislam.net



దీని కారణంగా అల్లాహ్ సామిప్యం పొందుతారు. మరియు (ఆ నమాజు) పాపాలను తుడిచిపెట్టేస్తుంది, తప్పుల నుండి నివారిస్తుంది.'' [1]

## విత్ర్ నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిస్సందేహంగా అల్లాహ్ బేసి సంఖ్యలో ఉన్నాడు. బేసిని ప్రేమిస్తాడు. కనుక ఖుర్ఆన్ (గ్రంథంగల) ప్రజలారా! బేసి సంఖ్యలో (విత్ర్) నమాజ్ చేయండి.'' [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ మీ కోసం ఒక నమాజు అదనంగా ప్రసాదించాడు. అది మీ పాలిట ఎరుపు ఒంటెలకన్నా ఎంతో మేలైనది. అది విత్ర్ నమాజు, ఆ నమాజును ఇషా మరియు ఫజ్ర్ మధ్య కాలంలో అల్లాహ్ మీ కొరకు ఉంచాడు. [3]

## చాష్త్ నమాజు (జుహా లేక అవ్వాబీన్ల నమాజు):

హజ్రత్ అబూ జర్ర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: ''మీలోని ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఉదయం తన ఒక్కొక్క కీలుకు బదులుగా సదఖా (దానం) ఇచ్చుకోవలసి ఉంటుంది. (అయితే) ప్రతిసారి **'సుబ్హానల్లాహ్'** అని పలకటం సదఖాగా పరిగణించబడు తుంది. ప్రతిసారి **'అల్హమ్దు లిల్లాహ్'** అని అనటం కూడా సదఖాయే.

---

[1] (సహీహ్ తిర్మిజీ:3549,హాకిమ్:1/502).
[2] (సహీహ్ అబూదావూద్:1416, సహీహ్ తిర్మిజీ:453).
[3] (సహీహ్ అబూదావూద్:1418, సహీహ్ తిర్మిజీ:452).

https://teluguislam.net



ప్రతిసారి **‘లా ఇలాహ ఇల్లాల్లాహ్’** అని అనటమూ సదఖాయే. ప్రతిసారి ‘అల్లాహు అక్బర్’ అని అనటం కూడా సదఖాయే. మంచిని గురించి ఆదేశించటం, చెడు నుండి ఆపటం కూడా సదఖాయే. ఎవరైనా వీటన్నిటికీ బదులుగా జుహా వేళ రెండు రకాతుల నమాజ్ చేసినా సరిపోతుంది.’’ [1]

హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; కొంత మంది జుహా నమాజ్ చేస్తుండగా చూసి తను ఇలా అన్నారు:

‘‘జాగ్రత్త! ఈ నమాజును ఇప్పుడు కాకుండా వేరే సమయంలో చేయటం ఉత్తమం అన్న సంగతి వీరికి బాగా తెలుసు.’’

నిస్సందేహంగా దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ‘‘(పాపాల నుండి) మరలేవారి (అవ్వాబీన్‌ల) నమాజు, ఎండ తీవ్రతకు గున్న ఒంటెల కాళ్ళు కాలినప్పుడు చేయబడుతుంది.’’ [2]

మరియు సహీహ్ ముస్లిం ఆధారంగా జుహా నమాజు రకాతుల సంఖ్య 2,4,8 రకాతులుగా ప్రవక్త ముహమ్మద్ (స) చదివినట్లు రూఢి అవుతుంది.

## తస్‌బీహ్ నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజియల్లాహు అన్హు) గారికి ఇలా బోధించారు:

‘‘ఓ బాబాయి! మీకు ఓ ప్రార్థన నేర్పుతాను దాని వలన మీరు ముందు వెనుక చేసిన పాపాలను, క్రొత్త పాత పాపాలను, తెలిసీ తెలియక చేసిన పాపాలను, చిన్న పెద్ద పాపాలను, గోచర అగోచర పాపాలన్నిటినీ క్షమించడం జరుగుతుంది........

---

[1] (ముస్లిం:1181).

[2] (ముస్లిం:1237).

https://teluguislam.net



ఓ బాబాయి! మీరు ఈ నమాజును ప్రతి రోజు, లేదా ప్రతి వారనికి, లేదా ప్రతి నెలకు, లేదా ప్రతి సంవత్సరమునకు ఒక సారి చదవగలిగితే చదువుకోండి. లేదా జీవితంలో కనీసం ఒక సారైనా చదవండి'' అని అన్నారు. [1]

## పశ్చాత్తాపం నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఏ వ్యక్తి అయితే పాపానికి గురికాబడిన తరువాత వుజూ చేసుకొని పోయి (రెండు రకాతుల) నమాజ్ నెరవేర్చి, పశ్చాత్తాప పడి, అల్లాహ్ వద్ద మన్నింపు కోరితే అతని పాపాలన్నీ క్షమించబడతాయి.'' [2]

హజ్రత్ ఇబ్ను మస్వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక వ్యక్తి ఓ స్త్రీని ముద్దాడాడు. కాని తరువాత (పాపభీతితో) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరకు వచ్చి, తన తప్పుని ఒప్పుకున్నాడు. ఆ సందర్భంగా అల్లాహ్ (దివ్య ఖుర్ఆన్‌లోని) ఈ సూక్తిని అవతరింపజేశాడు. 'నమాజు స్థాపించు – పగలు రెండు సంధ్యావేళల్లోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. నిస్సందేహంగా సత్కర్మలు దుష్కర్మల్ని దూరం చేస్తాయి.' ఈ ఆదేశం నా కొక్కడికేనా దైవప్రవక్తా! అని అడిగాడా వ్యక్తి. దానికి సమాధానంగా '(లేదు). నా అనుచర సమాజంలోని వారందరికీ' అని అన్నారు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం). [3]

---

[1] (సహీహ్ అబూదావూద్:1297, సహీహ్ ఇబ్నుమాజా:1387).

[2] (సహీహ్ తిర్మిజీ:406, సహీహ్ ఇబ్నుమాజా:1395).

[3] (బుఖారీ:495, ముస్లిం:4963).

https://teluguislam.net



## వుజూ చేసిన తరువాత రెండు రకాతుల నమాజు:

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘ఏ వ్యక్తి అయితే నేను చేసినట్లు వుజూ చేసి, ప్రపంచపు ఎలాంటి ఆలోచనలు చెయ్యకుండా రెండు రకాతులు నమాజు చేస్తే, అతని వల్ల జరిగిన గత పాపాలన్నిటిని అల్లాహ్ క్షమిస్తాడు.’’ [1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘ఏ ముస్లిమయితే చక్కగా వుజూ చేసి, పూర్తి ఏకాగ్రతతో రెండు రకాతుల నమాజు చేస్తే, అతనికై స్వర్గం అనివార్యమైపోతుంది.’ [2]

హజ్రత్ బురైదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక రోజు ఉదయాన హజ్రత్ బిలాల్ (రజియల్లాహు అన్హు) గారిని పిలిచి:

‘బిలాల్! నాకంటే ముందు ఏ ఆచరణ కారణంగా నీవు స్వర్గంలో ఉన్నావు? నేను స్వర్గంలో ప్రవేశించిన ప్రతిసారి నా ముందర నీవు నడిచే (పాదాల) సవ్వడి విన్నాను. మరియు ఈ రోజు రాత్రి కూడా అలానే జరిగింది. నేను స్వర్గంలో ప్రవేశించగానే నీవు నడిచే సవ్వడిని విన్నాను...’ అని అన్నారు.

దానికి హజ్రత్ బిలాల్ (రజియల్లాహు అన్హు) ఇలా సమాధానమిచ్చారు: **యా రసూలల్లాహ్!** ‘నేను ఆజాన్ చెప్పిన ప్రతిసారి రెండు రకాతుల నమాజ్ తప్పక చేసుకుంటాను. నా వుజూ భంగమయిన ప్రతి సారి తిరిగి వుజూ చేసుకుంటాను. (వుజూ చేసుకున్న ప్రతిసారి) అల్లాహ్ కోసం

---

[1] (బుఖారీ:155, ముస్లిం:331).

[2] (సహీహ్ సునన్ నసాయిూ:151)

https://teluguislam.net



రెండు రకాతుల నమాజు చదవడం నాపై అనివార్యమైనదిగా చేసుకున్నాను' అని అన్నారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (స ): **'ఆ రెండు రకాతుల కారణంగానే నీవు నాకంటే ముందుగా ఉన్నావన్న మాట'** అని అన్నారు. [1]

## నఫిల్ ఉపవాసాలు:

ఫర్జ్ ఉపవాసాలను నేరవేర్చిన తరువాత ఒక ముస్లిం అదనపు ఉపవాసాలు పాటిస్తే అల్లాహ్ ప్రసన్నత పొందే అవకాశాలు ఉండాయి.

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: 'ఎవరయితే అల్లాహ్ మార్గంలో ఒక రోజు ఉపవాసం ఉంటారో, వారి ముఖాలను అల్లాహ్ నరకం నుండి డెబ్బై యేండ్ల (ప్రయాణం) మేరకు దూరంగా ఉంచుతాడు' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రమజాన్ తరువాత

---

[1] (అహ్మద్:5/360, సహీహ్ తిర్మిజీ:3689).

**ముఖ్య గమనిక:** షబే మేరాజ్ నమాజ్ మరియు షబేబరాత్ నమాజు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) లేక సహాబాలు (రజియల్లాహు అన్హుం) ఆచరించినట్లు ఒక్క హదీసు సహితం నిజమైనది లేదు.
కనుక ఆ నమాజుల గురించి వచ్చిన విధానాలు కూడా కల్పితాలు మాత్రమే. ఆ రెండు రాత్రుల్లో లేక పగలు చేసే ఏ ఒక్క కార్యానికి ఆధారాలు లేవు. కనుక అది ఇస్లాం ధర్మంలో క్రొత్తగా జొప్పించబడిన బిద్అత్ కార్యాలు.

[2] (బుఖారీ:2628, ముస్లిం:1948).

https://teluguislam.net



అల్లాహ్ మాసమయిన ముహర్రం నెలలో పాటించబడే ఉపవాసాలు అత్యంత శ్రేష్ఠమైనవి. అలాగే ఫర్జ్ నమాజుల తరువాత పాటించబడే (నఫిల్) నమాజుల్లో తహజ్జుద్ నమాజు అత్యంత శ్రేష్ఠమైనది.''[1]

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, ''అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది'' అని చెప్పారు. [2]

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని నేను ఇలా అడిగాను:

**'యా రసూలల్లాహ్!** మీరు షాబాన్ మాసంలో (అధికంగా) ఉపవాసాలు పాటించినట్లు, ఏ ఇతర మాసాలలో అన్ని ఉపవాసాలను పాటించినట్లు నేను మిమ్మల్ని చూడలేదు.'

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా బదులిచ్చారు: ''రజబ్ మరియు రమజాన్ నెలకి మధ్య ఉన్న షాబాన్ నెల యొక్క వాస్తవం ప్రజలకు తెలియదు. ఈ నెలలో ప్రజలు చేసిన కార్యాలు అల్లాహ్ యందు సమర్పించబడతాయి. కనుక నా పుణ్యకార్యాలు అల్లాహ్ ముందు నేను ఉపవాస స్థితిలో ఉండగా సమర్పించబడాలని ఇష్టపడుతున్నాను.'' [3]

---

[1] (ముస్లిం:1983).
[2] (ముస్లిం:1977).
[3] (సహీహ్‌సునన్ నసాయీ:2357, అహ్మద్:20758 ).